వైఎస్సార్ సీపీతో నవ వసంతం

- దేశానికి రోల్ మోడల్‌గా ఏపీ
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కన్నబాబు
- అట్టహాసంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం
- ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంపీ గీత, ఎమ్మెల్సీ పద్మశ్రీ



వైద్యనగర్‌లోని పార్టీ కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ జెండాకు సెల్యూట్ చేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, చిత్రంలో ఎంపీ వంగా గీత తదితరులు



వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న కౌడా చైర్‌పర్సన్ చంద్రకళాదీప్తి, పార్టీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ పద్మశ్రీ

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ ఆవిర్భావంతో రాష్ట్రానికి నవ వసంతం వచ్చిందని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికి రోల్ మోడల్‌గా నిలిచిందని కాకినాడ జిల్లా పార్టీ అధ్యక్షుడు, రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. ఆదివారం రమణయ్యపేట వైద్యనగర్‌లోని జిల్లా వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. వేడుకలకు ఎంపీ వంగా గీత, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత పార్టీ జెండాను ఆవిష్కరించి, దివంగత వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ సంక్షేమ రాజ్యం ఎలా ఉంటుందో నిరూపించుకున్నామంటే దానికి వైఎస్సార్ సీపీ ఆవిర్భావం కారణమన్నారు. దివంగత వైఎస్సార్ అనుకోని పరిస్థితుల్లో హెలికాప్టర్ ప్రమాదంలో మరణించడంతో ఈ రాష్ట్రం ఏమైపోతుందోనని ప్రజలు ఆవేదనతో ఉన్నప్పుడు పుట్టెడు దుఃఖాన్ని దిగమింగి, నేనున్నానంటూ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు వచ్చారన్నారు. ఎన్నో కష్టాలు, పోరాటాలు, ఇబ్బందులు, అవమానాలు, యుద్ధాలు చేసి ఈ రాష్ట్రంలో కొత్త రాజకీయ ఒరవడికి శ్రీకారం చుట్టారన్నారు. ప్రజల గుండె చప్పుడు వినే నాయకుడు ఎవరైనా ఉన్నారంటే అది జగన్‌మోహన్‌రెడ్డి అని దేశమంతా ఒప్పుకొనే విధంగా పరిపాలన సాగుతుందన్నారు. అవినీతి రహిత పాలనతో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి సాధిస్తుందన్నారు. నవరత్నాల పేరిట పేదలందరికీ ఇళ్ల మొదలుకుని అమ్మఒడి వరకూ, వైఎస్సార్ చేయూత మొదలుకొని వాహన మిత్ర వరకూ సుమారు 32 సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నారన్నారు. బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ కాదు.. బ్యాక్ బోన్ క్యాస్ట్ అని ప్రకటించి ఈ రాష్ట్రాన్ని జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు తీసుకువెళుతున్నారని కన్నబాబు అన్నారు. ఒకటో తేదీ తెల్లవారు జామునే తలుపుతట్టి అవ్వా తాతలకు పింఛను ఇచ్చే కార్యక్రమం దిగ్విజయంగా అమలు చేస్తున్నారని కొనియాడారు. సీఎం జగన్ వెంట నడవడాన్ని గొప్పగా భావిస్తున్నామని, వలంటీరు, సచివాలయ వ్యవస్థలను విజయవంతంగా అమలు చేస్తున్నారన్నారు. ప్రతి నాయకుడు, కార్యకర్త, అభిమానాలకు వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలను ఆయన తెలియజేశారు.

అందరి మన్ననలూ పొందుతూ..

ఎంపీ వంగా గీత మాట్లాడుతూ అతితక్కువ కాలంలో అందరి మన్నలు పొందిన ఘనత వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికు దక్కుతుందన్నారు. ప్రతి ఒక్కరూ గర్వంగా చెప్పుకొనేలా పాలనను అందిస్తున్నారని, దేశ ప్రజలంతా ఏపీ వైపు చూస్తున్నారన్నారు. సామాజిక న్యాయం, మహిళలకు రక్షణ, రైతులకు, బడుగు బలహీన వర్గాలకు అండగా జగనన్న నిలుస్తున్నారని అన్నారు. ఆయనను మళ్లీ సీఎంగా చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. జెడ్పీ మాజీ చైర్మన్, కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిశీలకుడు దున్నా జనార్దనరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ 13వ వసంతంలోకి అడుగు పెట్టడం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు వరమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, ఎంపీపీలు గోపుశెట్టి పద్మజా బాబ్జీ, పెంకే శ్రీలక్ష్మి సత్తిబాబు, వీరేష, వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల బీసీ సెల్ రీజినల్ కోఆర్డినేటర్ అల్లి రాజుబాబు, మహిళా విభాగం రీజినల్ కోఆర్డినేటర్ జమ్మలమడక నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సంబరాలు

బోట్‌క్లబ్: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత దివంగత మాజీ సీఎం వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. భారీ కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా కౌడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకూ తగిన గుర్తింపు ఇచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ప్రజల వద్దకే సేవలు దరిచేరాయని అన్నారు. సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పార్టీ కార్యకర్తల అభివృద్ధికి ఎంతగానో శ్రమిస్తున్నారని తెలిపారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల వద్దకు వెళ్తుంటే వారి కళ్లలో ఎనలేని సంతోషం కనిపిస్తుందన్నారు. మాజీ మేయర్, నగర పార్టీ అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న పథకాలతో పేదలు అన్నివిధాలా ప్రగతి సాధిస్తున్నారన్నారు. బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా సీఎం జగన్ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ బషీరుద్దీన్ మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం అహర్నిశలూ పాటుపడుతుందన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో నగరం ప్రగతి పథాన పయనిస్తుందన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, డిప్యూటీ మాజీ మేయర్ మీసాల ఉదయకుమార్, స్మార్ట్ సిటీ మాజీ చైర్మన్ అల్లి రాజబాబు, పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, మాజీ కార్పొరేటర్లు నల్లబిల్లి సుజాత, కర్రి శైలజ, చిట్నీడి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రెగ్యులరైజ్ చేయాలని వినతి



ఎంపీ గీతకు వినతి పత్రం అందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

కాకినాడ క్రైం: కొన్నేళ్లుగా కాంట్రాక్టు విధానంలో విధులు నిర్వర్తిస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టు స్టాఫ్ నర్సెస్ వెల్ఫేర్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ చిన్నారి ఆధ్వర్యంలో పలువురు స్టాఫ్ నర్సులు ఆదివారం ఎంపీ వంగా గీతను కలిశారు. ఈ మేరకు నగరంలోని ఆమె కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. నర్సుల వినతిపై సానుకూలంగా స్పందించిన ఎంపీ ఇప్పటికే ఈ విషయం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టిలో ఉందని, తానూ మరోమారు సీఎం దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. వైద్య, ఆరోగ్య రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. పేద, కోవిడ్ వేళల్లో రోగులకు నర్సులు అందిస్తున్న సేవలు మరువలేవని ఎంపీ అన్నారు. అసోసియేషన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఆర్.జీవ కుమార్, జోనల్ కోఆర్డినేటర్ కె.స్వామిదాస్ ఫిలిప్, స్టాఫ్ నర్సులు నీలిమ, నాగజ్యోతి, వరలక్ష్మి, ఆరీఫా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరం



మెగా శిబిరంలో వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

కాకినాడ రూరల్: వలసపాకల గ్రామ పరిధిలోని కోరమాండల్ ఆసుపత్రి ప్రాంగణంలో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కోరమాండల్ ఇంటర్నేషన్ సంస్థ సామాజిక సేవల్లో భాగంగా మెడికవర్ ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరాన్ని కస్టమ్స్ డిప్యూటీ కమిషనర్ కె.విజయకుమార్ ప్రారంభించారు. కోరమాండల్ కర్మాగారం సమీపంలోని గ్రామాల నుంచి తరలివచ్చిన సుమారు 900 మందికి వివిధ ఆరోగ్య సేవలు అందించారు. గుండె, కిడ్నీ, గర్భకోశ, ఎముకలు, దంత, మధుమేహం, రక్తపోటు తదితర సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఈసీజీ, అల్ట్రా సౌండ్ స్కానింగ్, సీటీ స్కాన్, ఎక్స్‌రే వంటి పరీక్షలు ఉచితంగా చేశారు. యూనిట్ హెడ్ శ్రీనివాసరావు, జీఎం హెచ్ఆర్ పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆపద మిత్రలకు శిక్షణ

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో ఈ నెల 14 నుంచి 25 వరకూ ఆపద మిత్రలకు శిక్షణ ఉంటుందని ఈటీసీ మేనేజర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ తూర్పుగోదావరి, అనకాపల్లి జిల్లాలకు చెందిన 100 మంది ఆపద మిత్రలకు శిక్షణ ఇస్తామని చెప్పారు. వలంటీర్లు, ఆశవర్కర్లలో ఉత్సావంతులైన వారిని ఎంపిక చేసి ఆపద మిత్రలుగా గుర్తించారన్నారు. విపత్తుల సమయంలో బాధితులను రక్షించడానికి ఆపద మిత్రలకు తరగతి గదిలో శిక్షణతో పాటు ఫీల్డ్ విజిట్ ఉంటుందన్నారు.

పంచారామ క్షేత్ర ప్రధానార్చకుడి మృతి



చెరుకూరి భీమేశ్వరశర్మ (పాత చిత్రం)

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీ సమేత కుమారరామ భీమేశ్వరస్వామి ఆలయ ప్రధానార్చకుడు చెరుకూరి భీమేశ్వరశర్మ ఆదివారం మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో ఉండగా కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆయన మృతికి ఆలయ ఈఓ డి.నాగమల్లేశ్వరరావు, ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు, ట్రస్టు బోర్డు సభ్యులు, అర్చకులు సంతాపం తెలిపారు.

17 నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

పెద్దాపురం: చంద్రమాంపల్లి హైస్కూల్ క్రీడా మైదానంలో ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకూ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు జిలాని శిష్య బృందం ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొంది. వ్యాయామ ఉపాధ్యాయులు ఎంఎం జిలాని మెమోరియల్ జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్ సాయంత్రం వేళల్లో నిర్వహిస్తామన్నారు. రూ. 500 ప్రవేశ రుసుం చెల్లించి జట్లు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.5 వేలను మొదటి నుంచి నాలుగు స్థానాలకు అందిస్తామన్నారు.

టీడీపీ ప్రచారం

కరప: గత టీడీపీ హయాంలో అనేక పథకాలు అమలు చేసినట్లు మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి అన్నారు. ఆదివారం గురజనాపల్లిలో ఆమె ఇంటింటికీ మీ అనంతలక్ష్మి, ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణ మూర్తి, మాజీ సర్పంచ్ పంపన కన్నారావు, క్లస్టర్ ఇన్‌చార్జి గండి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆచార వ్యవహారాలు అలవర్చుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న బషీరుద్దీన్

బోట్‌క్లబ్: ముస్లిం విద్యార్థులు తమ చదువుతో పాటు ఇస్లాం ధర్మం, ఆచార వ్యవహారాలు అలవర్చుకోవాలని రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్ అన్నారు. స్థానిక జేఎన్‌టీయూ వద్ద ఉన్న మేవా ఫంక్షన్ హాల్‌లో దావత్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జల్సా అజ్మితే ఖుర్‌ఆన్ ఇస్తిఖ్బాలే రమజాన్ కార్యక్రమం నిర్వహించారు. ఇస్లాం నియమ నిబంధనలు కూడా విద్యార్థులు తమ పాఠశాల విద్యతో పాటు కొనసాగించాలన్నారు. జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ రెహ్మాన్‌ఖాన్ మాట్లాడుతూ దావత్ చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలను కొనియాడారు. దావత్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఖురాన్ పఠనం పూర్తి చేసుకున్న 36 మంది విద్యార్థులను ముఖ్య అతిథులు సత్కరించారు. కార్యక్రమంలో మేవా అధ్యక్షుడు ఎండీ జవహర్ అలీ, వక్ఫ్ బోర్డు కార్యదర్శి కరీం బాషా, ట్రస్ట్ కాకినాడ ఇన్‌చార్జి షకీల్ పాషా పాల్గొన్నారు.

వెంకన్న సన్నిధిలో అన్నసమారాధన

బోట్‌క్లబ్: స్థానిక మెహర్‌నగర్‌లోని అలివేలు మంగ పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి 49వ వార్షిక కల్యాణ మహోత్సవాల సందర్భంగా ఆదివారం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు మల్లిపూడి వెంకటేష్, మల్లిపూడి ఛత్రపతి శివాజీ గణేష్ తదితరులు పర్యవేక్షించారు.

వైభవంగా విజయ సత్తెమ్మ జాతర



సత్య ప్రియ బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన



రమణయ్యపేటలో విజయ సత్తెమ్మ తల్లి

కాకినాడ రూరల్: రమణయ్యపేట గ్రామ ఈశ్వర్‌నగర్‌లో విజయ సత్తెమ్మ వారి ఆలయం వద్ద 22వ జాతర మహోత్సవాలు అట్టహాసంగా జరిగాయి. రెండు రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాలు ఆదివారం రాత్రితో ముగిశాయి. అమ్మవారిని ఈశ్వర్‌నగర్ వాసులతో పాటు గ్రామస్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కండవల్లికి చెందిన సత్య ప్రియ బృందం కూచిపూడి నృత్యం అలరించింది. అలాగే సర్పవరంలో ప్రసిద్ధి గాంచిన రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామివారి ఆలయాన్ని కాకినాడ స్పెషల్ మొబైల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ సి.జానకి, అంజిబాబు దంపతులు దర్శించుకున్నారు. తొలుత వారికి ఆలయ అధికారులు, చైర్మన్ నారాయణరావు స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనాలు అందించారు.

ముగిసిన నాటక పోటీలు



ఎమ్మెల్యే దొరబాబుకు షీల్డును అందజేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: కొండెవరంలో వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి నాటక పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా నాటక కళా పరిషత్ అధ్యక్షుడు మేడిశెట్టి శ్రీరాములు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దొరబాబుకు పిఠాపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో షీల్డ్‌ను అందజేశారు. పలువురు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార కార్యకలాపాలకు అనువుగా నగరం



స్మార్ట్ లేబొరేటరీస్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న

కాకినాడ క్రైం: దిగ్గజ కార్పొరేట్ సంస్థల వ్యాపార కార్యకలాపాలకు కాకినాడ నగరం అత్యంత అనువైందని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. నగరానికి రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు ఉందన్న ఆయన ఇక్కడి ప్రజల కొనుగోలు శక్తి ఆదాయానికి అనుగుణంగా పెరిగిందన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని పేర్రాజుపేటలో కొత్తగా ఏర్పాటైన స్మార్ట్ లేబొరేటరీస్‌ను ద్వారంపూడి ప్రారంభించారు. అనంతరం సంస్థ సీఈఓ కృష్ణచైతన్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. స్మార్ట్ లేబొరేటరీస్‌ను నగరానికి ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దేశంలో వివిధ రాష్ట్రాల్లో సేవలందిస్తున్న సంస్థ కాకినాడలో తన కార్యకలాపాలు విజయవంతంగా విస్తరించాలని ఆకాంక్షించారు. సంస్థలో స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని యాజమాన్యాన్ని కోరారు. అనంతరం సంస్థ సీఈఓ కృష్ణచైతన్య, చైర్మన్ వెన్నల దీపక్ మాట్లాడుతూ కోవిడ్ పరీక్షల కిట్‌ను మొట్టమొదటి సారి తయారు చేసి దేశానికి అందించిన ప్రతిష్టాత్మక మైల్యాబ్ సంస్థ ఆధ్వర్యంలో స్మార్ట్ లేబొరేటరీస్ పని చేస్తుందన్నారు. జెనెటిక్ డిజార్డర్స్, కేన్సర్, టీబీ, తలసేమియా, ఈక్లియాతో పాటు పలు కీలక పరీక్షలకు తమ ల్యాబ్ దేశంలో ఉత్తమ ల్యాబ్‌గా పేరొందిందన్నారు. కనీసం 4 రోజుల సమయం తీసుకునే పరీక్షలకు కేవలం 24 గంటల్లో తమ ల్యాబ్‌లో పూర్తి చేసి కచ్చితమైన రిపోర్టు ఇస్తామని అన్నారు. అందుకుతగ్గ టెక్నాలజీ, నిపుణులు తమ ల్యాబ్‌లో అందుబాటులో ఉన్నారన్నారు. ఎన్ఏబీఎల్ ప్రమాణాలతో మాలిక్యులర్ బయాలజీ టెక్నాలజీతో రూపుదిద్దుకున్న తమ ల్యాబ్ ద్వారా అత్యంత కచ్చితమైన విలువలతో వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నగర మాజీ మేయర్ సుంకర శివప్రసన్నతో పాటు కార్పొరేటర్లు, సంస్థ సౌత్ హెడ్ రంగా, తెలంగాణ మార్కెటింగ్ హెడ్ దయానా తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నివారణపై అవగాహన

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య, ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలల్లో చదువుతూ రామేశ్వరంపేటలో హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులకు మత్తు పదార్థాల (డ్రగ్స్) నివారణపై ఆదివారం స్థానిక ఎస్సై వై.గణేష్‌కుమార్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాల జోలికి వెళ్లరాదన్నారు. సత్ప్రవర్తనతో మెలిగి కన్నవారికి, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఎవరైనా మత్తు పదార్థాలు వాడినా, విక్రయించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. జగ్గంపేట సీఐ బి.సూర్య అప్పారావు, గండేపల్లి ఎస్సై వై.గణేష్ కుమార్ ఫోన్ నంబర్లతో ఉన్న డ్రగ్స్ రహిత సమాజం అనే పోస్టర్‌ను కళాశాల, హాస్టల్‌లో ఏర్పాటు చేశారు. పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలు



జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్: జిల్లా ఫెన్సింగ్ సంఘం ఆధ్వర్యంలో కాకినాడ ద్రోణాచార్య అకాడమీ ఆవరణలో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి సీనియర్స్ ఫెన్సింగ్ పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. పోటీల ముగింపు ఉత్సవానికి ఫెన్సింగ్ సంఘ రాష్ట్ర కార్యదర్శి జీఎస్‌వీ కృష్ణమోహన్ ముఖ్య అతిథిగా విచ్చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం నలుమూలల నుంచి క్రీడాకారులు హాజరుకాగా వారిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని జాతీయ స్థాయికి ఎంపిక చేశామన్నారు. వీరు ఈ నెల 24 నుంచి పూణేలో జరిగే పోటీలలో పాల్గొంటారని వివరించారు. ప్రకాశం, తూర్పుగోదావరి, అనంతపురం జిల్లాలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయన్నారు. విజేతలకు షెల్టన్ కంపెనీ అధినేత సలాది సత్యనారాయణ మూర్తి బహుమతులు సమకూర్చారు.

ప్లీజ్... కాస్త ఆపండి

- కీలక సెంటర్లలోనూ ఆగని బస్సులు
- నిరుపయోగంగా బస్ షెల్టర్లు
- ప్రయాణికులకు తప్పని అవస్థలు



జెడ్పీ సెంటర్‌లో బస్సుల కోసం ఇలా రోడ్డుపై నిరీక్షణ



పద్మప్రియ సెంటర్‌లో నిరుపయోగంగా బస్ షెల్టర్

కాకినాడ కల్చరల్: కాకినాడ.. జిల్లా కేంద్రం. వివిధ పనుల నిమిత్తం అనేకమంది ప్రజలు నగరానికి వస్తుంటారు. చాలా మంది ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణిస్తుంటారు. అలాగే వివిధ కళాశాలల విద్యార్థులకూ అవే ఆధారం. అయితే నగరంలో ప్రధానమైన సెంటర్లు అనేకం ఉన్నా బస్సులు ఆపడం లేదు. కొన్నిచోట్ల రూ.లక్షలు వెచ్చించి బస్ షెల్టర్లు నిర్మించినా అవి నిరుపయోగంగా మారాయి. గతంలో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బస్సు బయలు దేరితే.. కోకిలా సెంటర్, పద్మప్రియ సెంటర్ వద్ద ఆగేవి. సర్పవరం, భానుగుడి సెంటర్ వైపు నుంచి వచ్చే ప్రయాణికులు పద్మప్రియ సెంటర్ బస్ స్టాప్ వద్ద వేచి ఉండేవారు. ప్రస్తుతం పద్మప్రియ సెంటర్ వద్ద బస్ స్టాప్ ఉన్నా బస్సులు ఆపకపోవడంతో నిరుపయోగంగా మారింది. ప్రయాణికులు, విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సుమారు కిలోమీటరు నడిచి బస్టాండ్‌కు వెళ్లి బస్సులు ఎక్కాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లేనిపక్షంలో ఆటోలను ఆశ్రయించాల్సి వస్తుందని అంటున్నారు. వర్షం కురిసినా, ఎండ పెరిగినా తమ పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని చెబుతున్నారు. అలాగే పీఆర్ కళాశాల వద్ద బస్ స్టాప్‌ను తొలగించడంతో వందలాది మంది విద్యార్థులు జీజీహెచ్ బస్ స్టాప్ వరకూ నడిచి వెళ్తున్నారు. అక్కడ బస్సు ఎక్కుతున్నారు. జెడ్పీ సెంటర్‌లో ఉన్న బస్ స్టాప్ వద్ద కేవలం రావులపాలెం, తాళ్లరేవు, రామచంద్రపురం రూట్‌లలో వెళ్లే బస్సులు మాత్రమే ఆగుతున్నాయి. కాకినాడ నుంచి సామర్లకోట, రాజమహేంద్రవరం, ఏలేశ్వరం, గోకవరం తదితర రూట్‌లలో వెళ్లే బస్సులను జెడ్పీ సెంటర్‌లో ఆపడం లేదు. ఇక్కడ బస్ స్టాప్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. దీనిపై కాకినాడ ఆర్టీసీ డిపో మేనేజర్ కె.మనోహర్‌ను వివరణ కోరగా ఈ విషయమై ప్రజల నుంచి వినతి పత్రాలు వస్తున్నాయని, పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

షెల్టర్ ఏర్పాటు చేయండి



కాకినాడలో ప్రధానమైన జెడ్పీ సెంటర్‌లో సామర్లకోట వైపు బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలి. ఇక్కడ షెల్టర్ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎండైనా, వానైనా రోడ్డుపైనే అవస్థలు పడాల్సి వస్తుంది. వేసవిని దృష్టిలో ఉంచుకుని జెడ్పీ సెంటర్‌లో బస్ షెల్టర్‌ను నిర్మించాలి.

– తురగా సూర్యారావు, కాకినాడ

ప్రాధాన్యాన్ని గుర్తించాలి




నగరంలో రద్దీగా ఉండే ప్రాంతాల్లో ప్రాధాన్యాన్ని గుర్తించి బస్ స్టాప్‌లు ఏర్పాటు చేయాలి. గతంలో మాదిరిగా కోకిలా సెంటర్, పద్మప్రియ సెంటర్, పీఆర్ కళాశాల ప్రాంతాల్లో బస్సులను ఆపాలి. విద్యార్థులు, మహిళలు, వృద్ధులు చాలా ఇబ్బంది పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

– సీహెచ్.ఏడుకొండలు, కాకినాడ

నాగులాపల్లిలో మెగా వైద్య శిబిరం

కొత్తపల్లి: నాగులాపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం ఉచిత సూపర్ స్పెషాలిటీ మెగా వైద్య శిబిరాన్ని కాకినాడ జిల్లారెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిబిరానికి అన్ని వ్యాధులకు సంబంధించి వైద్య నిపుణులు పాల్గొన్ని రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు. ఈ వైద్య శిబిరంలో 1200 మంది రోగులకు పరీక్షలు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి(ఫైల్)

కొత్తపల్లి: గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఆదివారం పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లి డీసీసీ బ్యాంకు సమీపంలో ఉన్న పాత పోలీసు స్టేషన్ వద్ద ఈ నెల పదో తేదీన సుమారు 50 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి పడి ఉండడంతో స్థానికులు అతనిని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆయన చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. దీనిపై ఎస్సై రామలింగేశ్వరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.